

శాయంపేట ఎంజేపీ పాఠశాలలో కిచెన్ పక్కనే వ్యర్థ పదార్థాలు



జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తలుపులులేని మరుగుదొడ్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్



అశోక్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో పనిచేయని సోలార్ వాటర్ హీటర్



గదులు సరిపడా లేకపోవడంతో వరండాలోనే బెడ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

అస్తవ్యస్త గురుకులాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధ్వానంగా పాఠశాలలు
- అద్దె భవనాలు, అరకొర వసతులతో సతమతం
- విద్యార్థులకు కానరాని కనీస సౌకర్యాలు
- చాలినన్ని మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- నాసిరకం భోజనంతో కడుపు మాడ్చుకుంటున్న వైనం
- ప్రహరీ లేక పురుగుల బారిన పడి రోగాలపాలు
- పేద విద్యార్థుల విద్యపై సర్కారు అశ్రద్ధ



ఫ్యాన్లు లేని నిద్రించే గది

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. కనీస సౌకర్యాలు మచ్చుకైనా కానరావడం లేదు. పేద విద్యార్థులు అధికంగా చదువుకునే ఈ గురుకులాలపై ప్రభుత్వం అంతగా శ్రద్ధపెట్టడం లేదు. కొన్ని సొంత భవనాల్లో నడుస్తుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కూనారిల్లుతున్నాయి. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు చాలినన్ని లేవు. ఉన్నవాటికి తలుపులు సరిగా లేవు. కొన్నిటికీ అసలు తలుపులే లేవు. పరిశుభ్రత కానరావడం లేదు. పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడివిని తలపింపచేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలల చుట్టూ ప్రహరీగోడలు లేక విద్యార్థులు విషపురుగుల కాటుకు గురవుతున్నారు. భోజనం నాణ్యతగా ఉండడం లేదు. కలుషిత ఆహారంవల్ల విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాలల దుస్థితిపై రౌండప్

గురుకులాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందకు పైగా గురుకులాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాలు (టీఎస్ఆర్ఈఐ), తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు (టీఎస్ఎస్ డబ్ల్యుఆర్ఈఐ), తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీఎస్‌టీడబ్ల్యుఆర్ఈఐ), గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీడబ్ల్యు ఆశ్రమ) మహాత్మాజ్యోతిబాపూలే విద్యాలయాలు (ఎంజేపీఐ), మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (ఎండబ్ల్యుఆర్ఐ) కస్తూర్బా గురుకుల పాఠశాలలు (కేఆర్ఐ) వీటిలో ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 22, వరంగల్ జిల్లాలో 26, ములుగు జిల్లాలో 9, మహబూబాబాద్ జిల్లాలో 39, జనగామ జిల్లాలో 16, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకుల పాఠశాలు ఉన్నాయి. వీటిలో 52వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



బండారుపల్లి గురుకులంలో నీటి కష్టాలు

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక గురుకులాలు అరకొర వసతులతో అవస్థలు పడుతున్నాయి. చాలా గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో సరైన సౌకర్యాలు లేవు. ప్రహరీగోడలు, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా నిర్మించిన గురుకుల భవనాలకు ప్రహరీలు నిర్మించడంపై శ్రద్ధ చూపించడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, ఉన్నత విద్యను అందించడానికి ఈ గురుకులాలను ఏర్పాటు చేయగా ఆ లక్ష్యం నెరవేడం లేదు. మెనూ ప్రకారం ఎక్కడా భోజనం వడ్డించడం లేదు. గురుకులాల్లో రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్‌లో బలవర్ధకమైన ఆహారం అందించాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. వారానికి నాలుగు రోజులు గుడ్లు, ఒక రోజు చికెన్, నెలకొకసారి రెండోవారం మటన్ వడ్డించాలి. కూరగాయలు కూడా నాణ్యమైనవి అందించాలి. ఉదయం టిఫిన్ సమయంలో బూస్ట్ కలిపిన పాలు అందించాలి. కానీ ఎక్కడా ఆ విధంగా చేయడం లేదు. మధ్యాహ్నం భోజనంలో ఒక కర్రీ, సాంబార్, పప్పు మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ మాత్రం నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అర్థాకలితో ఇబ్బందులు పడుతున్నారు. టిఫిన్ కూడా రోజూ ఒక రకం పెట్టాలి. కానీ ఏది తక్కువ ధర ఉంటుందో వాటినే అందిస్తున్నారు. వంట సరిగా చేయనివారిని మార్చాలని సూచిస్తున్నప్పటికీ ప్రిన్సిపాళ్ల దయతో వారినే కొనసాగిస్తున్నారు. కొన్ని గురుకులాల్లో పాడైన కూరగాయలు, మధ్యాహ్నం మిగిలిన పప్పుతో రాత్రికి సాంబార్ చేస్తున్నారని సమాచారం. నిల్వ ఉంచిన కూరలు తిని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు.

హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లాలో 22 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేరు 450మంది విద్యార్థులకు పది మరుగుదొడ్లే ఉన్నాయి. కొత్త భవనం నిర్మాణంలో ఉన్నది. ఎల్కతుర్తి మండలంలోని కస్తూర్బా పాఠశాలలో డార్మెట్రీలు లేవు. చాలినన్ని గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఫ్లోరింగ్ దెబ్బతిన్నది. పాఠశాల పక్కనే అడవి ఉండడంతో పాములు, తేళ్లు లోపలికి వస్తున్నాయి. శాయంపేట మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర పాఠశాల కిచెన్ పక్కనే వ్యర్థపదార్థాలను పారవేస్తుండడంతో కుళ్లి కంపుకొడుతోంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. కనీస వసతుల్లేవు. భవనానికి కిటికీలు లేవు. తాగునీటి సౌకర్యం సరిగా లేదు. కోతుల బెడద అధికంగా ఉంది. ఈ పాఠశాలకు గ్రౌండ్ లేదు. పరిసరాలు పరిశుభ్రంగా లేక దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పాఠశాల నూతన భవనం అసంపూర్తిగా ఉంది.

వరంగల్ జిల్లా

వరంగల్ జిల్లాలో అన్ని రకాల గురుకులాలు కలిపి 26 ఉన్నాయి. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సైనిక పాఠశాలలో పాఠశాల ఆవరణలో అంతర్గతంగా సీసీ రోడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో డైనింగ్ హాల్‌కు వెళ్లడానికి విద్యార్థులు బురదలో నడుచుకుంటూ వెళ్తున్నారు. పాఠశాల చుట్టూ పూర్తిస్థాయిలో ప్రహరీగోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. 680మంది విద్యార్థులున్నా.. పాఠశాలలో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్స్ దుప్పట్లు ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. నర్సంపేట డివిజన్‌లో 26 బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికలు, బాలుర వసతిగృహాలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, ఎస్టీ కళాశాల హాస్టల్, ఎస్సీ, బీసీ, ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్, ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్, మైనారిటీ గురుకులం, మహేశ్వరంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె ఆశ్రమ కళాశాల హాస్టల్, చెన్నారావుపేట, దుగ్గొండి మం డలాలకు చెందిన సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక నర్సంపేట పట్టణంలో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు

మిగతా 7వ పేజీలో..



కొరియా పారిశ్రామిక వేత్తలతో టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడుల కోసం చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్ వస్త్రనగరికి కలిసి వచ్చేనా..?!

- కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కొరియా పెట్టుబడులు
- దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- పెట్టుబడులకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలత
- ఇప్పటికే 8 ఫ్యాక్టరీలు పెడుతున్న కొరియా కంపెనీ యంగాన్
- సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు వచ్చే చాన్స్

7





వరంగల్ రైల్వే స్టేషన్‌లో జెండాకు వందనం చేస్తున్న బీజేపీ నాయకులు

అమరుల త్యాగాల ఫలితమే దేశ స్వాతంత్ర్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మిల్స్‌కాలనీ(వరంగల్), ఆగస్టు 12: ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితమే భారత స్వాతంత్ర్యమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగ యాత్రను నిర్వహించారు. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు నిర్వ హించిన ఈ కార్యక్రమంలో గంట పాల్గొని మాట్లాడారు. అమరుల త్యాగాలను ప్రతీ భారతీయుడు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించేందుకు బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగ అభియాన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రలో 75 అడుగుల పొడవుతో ఉన్న జాతీయ జెండాను 300 మంది యువతతో తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు భరత్‌వీర్ పాల్గొన్నారు.


డీఐఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ సుమన్



డీఐఈవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 12: వరంగల్ జిల్లా ఇంట ర్మీడియెట్ విద్యాశాఖాధికారిగా జి. శ్రీధర్ సుమన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఆయన హనుమకొండలోని వరంగల్ డీఐఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణమోహన్‌రెడ్డి, సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ



ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఏఈ గోపాల్

బాలసముద్రం, ఆగస్టు 12: హనుమకొండలోని నక్కలగుట్ట సమీపంలో రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ డి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుం టతండా గ్రామానికి చెందిన బానోతు యాకు మాజీ ఎంపీటీసీగా పని చేశాడు. యాకు భార్య సర్పంచ్‌గా పని చేసిన సమయంలో గుడికుంటతండ గ్రామంలో యాకు రూ.లక్ష 27వేల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు

మిగతా 8వ పేజీలో

చెరువులోపడి ఇద్దరి ఆత్మహత్య

- రాయపర్తి శివారులో ఘటన
- మృతులు పైడిపల్లి వాసులుగా గుర్తింపు
- వివాహేతర సంబంధమే కారణమా?



సంగాల దిలీప్ (ఫైల్)



తిక్క అంజలి (ఫైల్)

రాయపర్తి/పోచమ్మమైదాన్, ఆగస్టు 12: చెరువులోకి దూకి యువతీ, యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లోని పైడిపల్లి గ్రామం మధ్యగూడెంకు చెందిన సంగాల దిలీప్(30) వరంగల్ నగరంలోని ఓ టైల్స్ షాపులో పనిచేస్తున్నాడు. దిలీప్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదిలాఉండగా పైడిపల్లి గ్రామానికే చెందిన తిక్క అంజలి(26) వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. అంజలి అవివాహిత కాగా, దిలీప్, అంజలికి కొద్దిరోజుల నుంచి పరిచయం ఏర్పడినట్టు సమాచారం. ఆదివారం ఉదయం పని ఉం దంటూ ఇంటి నుంచి బయలుదేరిన దిలీప్ ఆ తర్వాత తిరిగిరాలేదు. అదే సమయంలో అంజలి కూడా కనిపించలేదు. ఇదిలా ఉండగా, సోమవారం మధ్యాహ్నం సమయంలో మేకల కాపరులు రాయపర్తి శివారు రామచంద్రుని చెరువులో రెండు మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఒడ్డుకుచేర్చి, మృతులు దిలీప్, అంజలిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వర్ధన్న పేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఒడ్డుపై ద్విచక్ర వాహనం, బ్యాగు, వాటర్ బాటిల్, చెప్పులు ఉండగా వీరి మరణానికి కారణం వివాహేతర సంబంధమే కారణమా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో విచారణ జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 12: వరంగల్ జిల్లాలో ఆసక్తి అర్హత కలిగిన అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 లోగా రెండు ప్రతుల దరఖాస్తులు సమర్పించాల్సిందిగా ఆమె కోరారు.

ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- గ్రీవెన్స్‌లో 265 వినతులు: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 12: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని మీసేవా కేంద్రాలను తరచుగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 265 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 70, ఎస్సీ కార్పొరేషన్‌కు 159, మహానగర పాలక సంస్థ 4, విద్యాశాఖ, డీపీవో 3, నర్సంపేట మెడికల్ కళాశాలకు 3 వివిధ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోటలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు చేయాలి

ఖిలావరంగల్, ఆగస్టు 12: ఖిలావరంగల్ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. సోమ వారం మధ్యకోటలోని ఖుష్‌మహల్ వద్ద వేడుకల ఏర్పాట్లను డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రొటోకాల్ అనుసరించి సీటింగ్ ఏర్పాట్లను, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్‌అడ్రస్ సిస్టం ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. స్టేజీ అలంకరణ, నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా రోడ్లు భవనాల అధికారి అజిత్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు, వరంగల్ మహానగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ లబ్ధిదారులకు కొత్త రుణాలు ఇవ్వండి..

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 12: రుణమాఫీ పొందిన లబ్ధిదారులకు నూతనంగా పంట రుణాలు కల్పించాలని డీసీసీ బ్యాంక్ మేనేజర్లను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లతో ఆయన సమీక్ష జరిపారు. పీఏసీఎస్‌లను సందర్శించి రుణమాఫీ పొందిన రైతులకు వీలైనంత త్వరగా కొత్తగా రుణాల అర్హులను గుర్తించాలని సూచించారు. వర్షాకాల పంటల సాగుకు కొత్తగా మంజూరు చేసే రుణాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆధార్ కార్డులో తప్పుడు నమోదుల కారణంగా రుణమాఫీ పొందడంలో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు పేర్కొన్నారు. దీనిని గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన రైతుల రుణాల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వం ప్రదర్శించిన పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. వ్యవసాయేతర పంట రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి బ్యాంక్ మేనేజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్‌సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజుతో పాటు వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సెల్ దొంగతనాలను అరికట్టడానికి పోర్టల్

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



ఫోన్ మహిళకు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 12: సెల్‌ఫోన్ల దొంగతనాలను అరికట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సీఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో సీసీఎస్ పోలీసులు సెల్‌ఫోన్ రికవరీ మేళాను నిర్వహించారు. రికవరీ చేసిన ఫోన్‌లను పోగొట్టుకున్న యజమానులకు సీపీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ.. దొంగతనం కాని, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఆచూకీ కోసం సీసీఎస్‌తో పాటు ప్రతీ స్టేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో 7,022 సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో 4,028 ఫోన్లను గుర్తించి 2527 స్వాధీనం చేసుకుని యజమానులకు అందించినట్లు తెలిపారు. వారంరోజుల్లోనే 150 ఫోన్లను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోర్టల్‌ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి కేయూ న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం మూడేళ్ల, ఐదేళ్ల కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19 నుంచి నిర్వహిస్తామని కేయూపరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్రం మూడేళ్ల కోర్సుల్లో 4, 6వ సెమిస్టర్, న్యాయశాస్త్రం ఐదేళ్ల కోర్సుల్లో 8, 10వ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కళాశాలలోనూ, వర్సిటీ వెబ్‌సైట్‌లోనూ సంప్రదించాలని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

అలాగే ఎల్ఎల్‌బీ మూడేళ్ల 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24,, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ మూడేళ్ల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 8వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 10వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 12: ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జ్ కం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేటకు చెందిన ఐదేళ్ల బాలిక.. తన తల్లితోపాటు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనకటి రఘుపతి జామపండ్లు తినిపిస్తానని పక్కకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు రఘుపతికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ పి.సురేందర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు కోట మహేందర్‌రెడ్డి, జి.అరుణ్ వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్ నీరజ కేసు విచారణలో సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన డ్రైవర్

అభినందించిన ఆర్టీసీ ఎం.డి సజ్జనార్

బాలసముద్రం, ఆగస్టు 12: హైదరాబాద్ ఉప్పల్ నుంచి డీలక్స్ బస్సులో హనుమకొండకు వస్తున్న ప్రయాణికుడికి మూర్ఛరావడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్ ప్రయాణికుడి ప్రాణాలు కాపాడడు. దీంతో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ డ్రైవర్‌కు సోమవారం అభినందనలు తెలిపారు. వరంగల్-2డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న బి.వెంకన్న హైదరాబాద్ ఉప్పల్- హనుమకొండకు బస్సు సర్వీసు నడుపుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉప్పల్ నుంచి హనుమకొండకు వస్తున్న క్రమంలో బస్సులో ఉన్న ప్రయాణికుడికి ఒక్కసారిగా మూర్ఛ రావడంతో తోటి ప్రయాణికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ అరగంట సమయం పడుతుందని చెప్పడంతో ఘట్‌కేసర్ నుంచి బీబీనగర్ వరకు డ్రైవర్ బస్సును వేగంగా తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుపోయినట్లు తెలిపారు. ప్రయాణికుడికి సమయానికి వైద్యం అందించడంతో ప్రయాణికుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, బస్సులో ఉన్న ఓ ప్రయాణికుడు ట్విట్టర్‌లో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్‌కు ఫొటోతీసి వివరాలు పోస్టు చేయడంతో ట్వి ట్టర్ ద్వారా డ్రైవర్‌కు సజ్జనార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, వరంగల్-2డిపో మేనేజర్ వి.జోత్స్న అధికారులు డ్రైవర్ వెంకన్నకు అభినం దనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని మహిళ (సుమారు 50-55 ఏళ్లు) మృతి చెందింది. ఈ సంఘ టన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డివిజన్ కేంద్రంలో ని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వెంట ఓ గుర్తు తెలియని మహిళ నడుచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి కొంత దూరం మృతదేహాన్ని ఈడ్చుకెళ్లింది. రహదారిపై పడి న మృతదేహంను ఆ సమయంలో ఎవరూ గమనించ కపోవడంతో జనగామ నుంచి హనుమకొండ వైపు అతివేగంగా వెళ్లే వివిధ వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో పాటు శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అటుగా వెళ్లిన గ్రామ పంచాయతీ సిబ్బంది రహదారిపై మహిళ మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసు సిబ్బంది, జీపీ సిబ్బంది చేరుకొని మహిళ మృతదేహం ను, శరీర భాగాలను ప్యాక్ చేసి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఘన్‌పూర్ జీపీ జూనియర్ అసిస్టెంట్ బుర్ర శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

వరంగల్ వస్త్రనగరికి కలిసి వచ్చేనా..?!

- దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు వచ్చే చాన్స్





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. భారీగా పెట్టుబడులను ఆహ్వానించి వరంగల్‌ను వస్త్రనగరిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జూన్ 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కులో పర్యటించి పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. తన విదేశీ పర్యటనలో వరంగల్ టెక్స్‌టైల్‌పార్కులో పెట్టుబడుల కోసం దక్షిణ కొరియాలోని ప్రముఖ కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే గత ఏడాది కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ ఎనమిది ఫ్యాక్టరీలను పెట్టేందుకు ఎంవోయూ కుదుర్చుకోగా, సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

సీఎం పర్యటనతో కలిసి వచ్చేనా..?

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి ప్రభుత్వం రూ.1,350కోట్ల వ్యయంతో 1,150 ఎకరాల్లో సుమారు 200లకు పైగా వస్త్ర కంపెనీలు, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా కేఎంటీపీ ద్వారా ఉపాధి కల్పించబోతున్నట్లుగా గత ప్రభుత్వం ఆశలు రేపింది. 22 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నప్పటికీ ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే అడుగు పెట్టాయి. ఇందులో 2021 జూలై 7వ తేదీన కైటెక్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కేరళకు చెందిన కైటెక్స్ రూ.1,200కోట్ల వ్యయంతో 187ఎకరాల్లో చిన్నపిల్లల దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. అలాగే గణేషా ఎకోపెట్, ఎకోటెక్ కంపెనీలు రూ.588కోట్ల వ్యయంతో సుమారు 50 ఎకరాల్లో రెండు యూనిట్లను ప్రారంభించింది. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నారు. వీటితో దారాలను తయారు చేస్తుండగా, మరో యూనిట్ బాటిల్ తయారీకి ముడి సరుకును అందిస్తుంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలే ఇక్కడ ఉత్పత్తి చేపట్టాయి. గత ఏడాది దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 2023లో గత ప్రభుత్వంతో యంగాన్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో జూన్ 29న వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణ కొరియా దేశంపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి తన విదేశీ పర్యటనలో భాగంగా ఆ దేశాన్ని సందర్శించారు. ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీ, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీతోపాటు మరో 25 అగ్రశ్రేణి కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులకు ఆహ్వానించటంతో వరంగల్‌లో వస్త్రనగరి భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెడితే వరంగల్ వస్త్రనగరిగా అభివృద్ధి చెందనుంది. అంతేకాకుండా సుమారు 2లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతో సీఎం రేంవత్‌రెడ్డి కొరియా పర్యటనలో కంపెనీలకు ఆహ్వానంపై ఉమ్మడి వరంగల్ జిల్లా వాసుల ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొరియా కంపెనీలతో సీఎం చర్చలు

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానికి దక్షిణ కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం దక్షిణ కొరియా దేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు గ్లోబల్ కంపెనీల అధినేతలు, బిజినెస్ గ్రూపులతో సమావేశాలు, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (కేవోఎఫ్‌వోటీఐ) ఆధ్వర్యంలో జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో సౌకర్యాలు, ప్రభుత్వం అందించే సహకారంపై సీఎం వివరించారు. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణపై స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలపై సీఎం వివరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో యంగాన్ కార్పొరేషన్ చైర్మన్ కియాంగ్ సంగ్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సొయంగ్ జూ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు పాల్గొన్నారు. కాగా, సీఎంతో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రానికి రూ.45 కోట్ల నిధులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం చేసేందుకు రూ.45 కోట్ల నిధులను విడుదల చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2015లో రాష్ట్ర ప్రభుత్వం రూ.85.10కోట్లతో వరంగల్ నగరంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాలు చేపట్టాలని ప్రత్యేక జీవోను జారీ చేస్తూ ముందుగా రూ.40.10కోట్ల నిధులను మంజూరు చేస్తూ నిర్మాణ పనులను తెలంగాణ టూరిజం శాఖకు పనులను అప్పగించింది. కానీ సదరు శాఖ అధికారులు పనుల్లో జాప్యం చేయడంతో అప్పటి ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను వరంగల్ కుడాకు అప్పగించింది. అప్పటి నుంచి కుడా అధికారులు పనులు చేస్తున్నారు. కాగా పనులు అంతిమదశకు చేరడంతో మిగతా పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు సంబంధిత అధికారులను కోరారు. వారు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.45కోట్ల నిధులను విడుదల చేస్తూ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రత్యేక జీవోను విడుదల చేశారు. అంతేకాకుండా సెప్టెంబరు 9లోగా కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్టు కుడా అధికారులు తెలిపారు.

55 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 12: కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో రూ.1లక్ష 37వేల విలువ కలిగిన 50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టి.రాజు అనే వ్యక్తి అంబాల పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. విచారణ నిమిత్తం రాజును కమలాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్ ధృవీకరించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మడికొండ, ఆగస్టు 12: యువకుడి వేధింపులు భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత(అంగన్‌వాడీ టీచర్) చికిత్స పొందుతూ మృతి చెందింది. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆరుముల్ల రమేష్‌కు అదే గ్రామానికి చెందిన అనితకు 14 యేళ్ల కిందట వివాహం జరుగగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, కొన్ని నెలలుగా అదే గ్రామానికి చెందిన మాతంగి రాజుతో ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా తీసుకొని అతడు అనితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. కొన్ని రోజులు అనిత తన తల్లిగారింటికి వెళ్లి వచ్చింది. రాజు తిరిగి ఫోన్ చేస్తూ, మెసేజ్‌లు చేస్తూ వేధిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తుండడంతో అప్పటికే తన పరువుపోయిందని భావించిన అనిత.. ఈనెల 10న గడ్డి మందు తాగింది. తన కుమారుడి ద్వారా విషయం తెలుసుకున్న ఆమె భర్త ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి



లకావత్ రాజశేఖర్ (ఫైల్)

కొత్తగూడ, ఆగస్టు 12: విషజ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్ల కొత్తగూడ మండలంలోని చిన్నతండాలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేణ్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నతండాకు చెందిన లకావత్ లక్ష్మి, రామచంద్రుల కుమారుడు రాజశేఖర్‌కు(17) రెండు రోజుల క్రితం తీవ్రజ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా శ్రీనివాస్

కన్వీనర్‌గా కొక్కొండ రమేష్ నియామకం



శామంతుల శ్రీనివాస్



కొక్కొండ రమేష్

వరంగల్ లీగల్, ఆగస్టు 12: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్‌గా, న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ను, కన్వీనర్‌గా న్యాయవాది కొక్కొండ రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర లీగల్‌సెల్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అదే విధంగా వైస్‌చైర్మన్లుగా న్యాయవాదులు ఇ.ఆనంద్‌మోహన్, మహ్మద్ అజామ్, గునిగంటి శ్రీనివాస్, ఇజ్జగిరి సురేష్, కొడిదల సంజయ్‌కుమార్, గంపా వెంకట రమణను నియమించారు. జాయింట్ కన్వీనర్లుగా న్యాయవాదులు జీవీ రమణమూర్తి, గన్ను హరిహర కుమార్, ఎం. శ్రీనాథ్‌బాబు, రొడ్డ అమృతరావు, రాచర్ల సురేశ్, మహ్మద్ జానికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

భూ వివాదంలో హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

వరంగల్ క్రైం, ఆగస్టు 12: భూ వివాదంలో జోక్యం చేసుకున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తోట బాబు అలియాస్ పోలీస్ బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం ఈ మేరకు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో వరంగల్ ప్రాంతలో స్థలం కొనుగోలు చేసేందుకు ఒక వ్యక్తి కొంత మొత్తాన్ని చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆ సమయంలో కరోనా రావడంతో సదరు వ్యక్తి స్థల యజమానికి పూర్తిగా డబ్బులు చెల్లించలేదు. దీంతో యజమాని ఇటీవల వేరే వ్యక్తికి విక్రయించాడు. ఇది తెలిసి మొదట అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తి వచ్చి స్థల యజమానితో గొడవకు దిగాడు. ఈ తంతు మొత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆ సమయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాబు భూ వివాదం విషయం తలదూర్చి సీఐ పేరు చెప్పి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల కిందట ఇరువర్గాల మధ్య శివనగర్‌లో జరిగిన పంచాయితీకి హాజరైన బాబు.. అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తిని బెదిరించినట్లు తెలిసింది. ఆదివారం బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తోట బాబుతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.. సీపీకి నివేదిక ఇవ్వగా, బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయమై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్‌పై తమ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలపడం గమనార్హం.

అస్తవ్యస్త గురుకులాలు

5వ పేజీ తరువాయి

పడుతున్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నేటి వరకు యూనిఫామ్ అందించలేదు.

ములుగు జిల్లా

ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లిలోగల తెలంగాణ బాలుర గురుకులంలో ఈనెల 1వ తేదీ రాత్రి 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ విషపురుగు కుట్టడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. 2వ తేదీన తెల్లవారుజామున 5గంటలకు 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదేరోజు ఉదయం 8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా, పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. వారంరోజులుగా సదరు విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గురుకులం చుట్టూ ప్రహరీ సరిగ్గా లేకపోగా పిచ్చి మొక్కలు దట్టంగా మొలవడంతో విషపురుగుల సంచారం ఉంది. తరుచూ విద్యార్థులు పాములు, తేళ్లను చూస్తున్నట్లు చెప్పారు. ఒకేరోజు ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో స్పందించిన రాష్ట్ర మంత్రి సీతక్క గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులకు ధైర్యం చెప్పి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఓ ప్రైవేటు భవనంలో మంగపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం కొనసాగుతోంది. భవనం సమీపంలోనే అటవీ ప్రాంతం ఉండటం, చుట్టూ పరిసరాలు చిత్తడిగా ఉండటంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. జాకారం సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల/కళాశాల గురుకులం పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ సమీపంలో అటవీ ప్రాంతం, చిత్తడి ప్రదేశాలుండటంతో ప్రమాదం పొంచి ఉంది. కాగా, ములుగులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం మూడంతస్తుల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. ఆటస్థలం లేకపోవడంతో బాలికలు పక్కనే ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఈ గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని కార్తీకశ్రీ ఈనెల 9న పాఠశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. తీవ్ర గాయాలతో బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

మహబూబాబాద్ జిల్లా

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని 18 మండలాల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూల్, ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలల బాల, బాలికల వసతిగృహాలు 21 ఉన్నాయి. వీటిల్లో కొన్ని మహాత్మాజ్యోతిబా పూలే, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర కళాశాల హాస్టల్‌లో నీటి సమస్య తలెత్తితే పక్కనే ఉన్న ఎస్సీ (సి,ఈ) బాలుర పాఠశాల హాస్టల్‌లో స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జనగామ జిల్లా

జనగామ జిల్లాలో 5 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 8 బీసీ గురుకులాలు, 2 మైనారిటీ గురుకులాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. గతంలో ఏర్పాటైన గురుకులాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల తలుపుల రేకులు విరిగిపోయాయి. జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని మరుగుదొడ్లకు అసలు తలుపులే లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు లీకేజీ అవుతున్నాయి. పాలకుర్తి మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు, మంచాలు లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ వర్షానికి కూలిపోయి మూడేళ్లవుతోంది. విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. విద్యార్థులకు ఇప్పటివరకు చెద్దర్లు, దుప్పట్లు ఇవ్వలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకులాలు ఉన్నాయి. వీటిల్లో ఈ యేడాది విద్యాసంవత్సరానికి గాను 2,460 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో గల మైనారిటీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో సరిపడా గదులు లేవు. 380 మంది విద్యార్థులకు గాను 9 గదులు నిద్రించడానికి, 6 గదులు క్లాస్ రూమ్‌లకు వినియోగిస్తున్నారు. రాత్రుల్లో వరాండాల్లోనే నిద్రిస్తున్నారు. పడుకునే బెడ్ల పక్కనే ర్యాక్‌లపై వారి దుస్తులు ఆరబెట్టుకోంటున్నారు. ఫ్యాన్‌లు సరిపడా లేవు. ఇప్పటివరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు మంజూరు కాలేదు. యూనిఫామ్ కూడా రాలేదు. సౌకర్యాలపై ఒకరిద్దరు విద్యార్థులను పలకరించగా భోజనం సరిగ్గా ఉండటం లేదని చెప్పుకొచ్చారు. రాత్రి వేళల్లో దోమలతో సావాసం చేయాల్సి వస్తోందని వాపోయారు.

తండ్రి మృతితో ఆగిన గుండె

- పెద్దంపేటలో తనయుడి హఠాన్మరణం
- తండ్రికొడుకుల మృతితో విషాదఛాయలు



బీసుల పెద్ద లస్మయ్య(ఫైల్)



బీసుల కృష్ణరాజు(ఫైల్)

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 12: కనిపెంచిన తండ్రి హఠాన్మరణంతో తనయుడి గుండె తట్టుకోలేకపోయింది. తండ్రి మృతితో తల్లడిల్లుతూ రోదించిన కొడుకు సైతం గుండెపోటుతో మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రి, కొడుకుల మృతితో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బీసుల పెద్ద లస్మయ్య(62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి మృతిని తట్టుకోలేని ఆయన పెద్ద కొడుకు బీసుల కృష్ణరాజు(30) రోదిస్తూనే తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం ఇంటికి వచ్చిన కొడుకు.. అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కృష్ణరాజు మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గంటల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి లస్మయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు కాగా, కృష్ణరాజు మొదటి సంతానం. కృష్ణరాజుకు భార్య రాణితో పాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు.

డీఎస్‌ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసివేయాలి

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు, సీపీఐ(ఎంఎల్)నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు12: హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో ఉన్న డీఎస్‌ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసి వేయాలని నీరుకుళ్ల (కందిబండ), పెంచికలపేట, కేవశాపురం గ్రామాలకు చెందిన ప్రజలు.. సీపీఐ (ఎంఎల్)నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. నీరుకుళ్ల గ్రామ శివారులోని చెన్నకేశవ స్వామి ఆలయం పక్కనే వేరు గ్రామాలకు చెందిన వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా పౌల్ట్రీఫామ్‌లు ఏర్పాటుచేసి గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. కోళ్లఫామ్ నుంచి దుర్వాసన వస్తోందని, దీంతో గ్రామ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. పారిశుధ్యంపై కోళ్లఫామ్ యజమానిని గ్రామస్తులు అడగగా గ్రామస్తులపై యజమాని దుర్భాషలాడుతూ కేసులు పెట్టించాడని ఆరోపించారు. వెంటనే కలెక్టర్ స్పందించి కోళ్లఫామ్ యజమానిపై చర్యలు తీసుకుని ఈగలు దోమల వ్యాప్తి చెంది ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న కోళ్లఫామ్‌ను మూసివేయించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నీరుకుళ్ల(కందిబండ), పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కమిటీ ఏర్పాటు

జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్

ఖిలావరంగల్, ఆగస్టు 12: టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా శామంతుల శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా కొక్కండ రమేష్‌లు నియమితులయ్యారు. సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ముద్దసీర్ అహ్మద్ ఖయ్యూం, నిమ్మని శేఖర్‌రావు, బైరపాక జయాకర్, కె.అంబరీష్‌రావు, నల్ల మహాత్ముల చేతుల మీదుగా నియామకపత్రాన్ని స్వీకరించారు. వైస్‌చైర్మన్‌లుగా ఈ.ఆనంద్‌మోహన్, మహమ్మద్ ఆజం, గునిగంటి శ్రీనివాస్, ఇజ్జగిరి సురేష్, కొడిదల సంజయ్‌కుమార్, గంప వెంకటరమణ, సంయుక్త కన్వీనర్‌లుగా జీవీ రమణమూర్తి, గన్ను హరిహరకుమార్, ఎం.శ్రీనాథ్‌బాబు, రొడ్డ అమృత్‌రావు, రాచర్ల సురేష్, ఎమ్డీ జానీలను నియమించారు. చైర్మన్‌గా ఎన్నికైన వరంగల్ శివనగర్‌కు చెందిన అడ్వకేట్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పంట రుణాల రెన్యూవల్

పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 12: పంట రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యూవల్ చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మొదటి, రెండో విడతల్లో రైతు రుణమాఫీ, రెన్యూవల్ పురోగతిపై బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు చేపట్టిన రుణమాఫీ పథకంలో రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. పంట రుణాలు పొందిన డబ్బులను వ్యవసాయ పనుల నిమిత్తం వాడుకునేలా చూడాలన్నారు. బ్యాంకు అధికారులు రుణమాఫీ డబ్బులు ఇతర రుణాల కింద జమ చేయకుండా సకాలంలో చెల్లించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, వ్యవసాయ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జిల్లా ఇంటర్మీడియేట్ డీఐఈవో శ్రీధర్ సుమన్



డీఐఈవోకు బొకే అందిస్తున్న కళాశాల సిబ్బంది

శంభునిపేట, ఆగస్టు 12 : గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వరంగల్ జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రులతోపాటు, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తానూ రంగశాయిపేటకు చెందిన వ్యక్తినని, కళాశాలను సందర్శించటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కళాశాల సిబ్బంది, విద్యార్థులు డీఐఈవోను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాములు నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ వీరాంజన్ కుమార్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ

5వ పేజీ తరువాయి

నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్ కౌంటర్ సంతకం చేసేందుకు రూ.6.వేలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏఈ గోపాల్‌కు లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఈనెల 9న యాకు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో సోమవారం ఉదయం 11:53 నిమిషాలకు హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట గోపాల్ బాధితుడు యాకు నుంచి రూ.6వేలు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ డి.సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాం సుందర్, ఎస్.రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణిలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 97 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, డీసీపీ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ట్యాక్స్ విభాగం అధికారి బిర్రు రవీందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణం అని నోటీసులు ఇచ్చారు

కాంగ్రెస్ హయాంలో గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ దేశాయిపేట ఎంహెచ్ నగరంలో సర్వే నెంబర్ 308లో 650మంది స్థిరనివాసాలు వేసుకుని నివసిస్తున్నాం. బీపీఎల్ కోటాలో ఇందిరమ్మ ఇండ్ల కింద పట్టాలు సైతం ఇచ్చారు. కానీ ఇప్పటి అధికారులు తాము చిన్నవడ్డెపల్లి చెరువు సమీపంలో నిర్మించుకున్నఇండ్లు ఎఫ్‌టీఎల్ కింద ఉన్నాయని అధికారులు నోటీసులు జారీ చేశారని గుడిసెవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. 2007లో తమకు పట్టాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చి ఎఫ్‌టీఎల్ భూములు అనడం ఎంత వరకు సమంజసం అని అధికారులను ప్రశ్నించారు. సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు, దివ్య, రమేష్, పత్తి కిరణ్, దినేష్, అస్లాం పాషలు కమిషనర్‌ను కలిశారు. తమ ఇండ్లను కూల్చి నిరాశ్రయులను చేయొద్దని వేడుకున్నారు.



వినతి పత్రం అందిస్తున్న ఎంహెచ్ నగర్ వాసులు

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	18
హెల్త్, శానిటేషన్	14
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	10
టౌన్‌ప్లానింగ్	54
డీఆర్‌ఎఫ్	1
మొత్తం	97

వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి..

ఇటీవల వరంగల్ ఎంజీఎంలో పసి కందును కుక్కలు పీక్కు తిన్న ఘటన తమను కలిచివేచిందని, అడ్డుకట్టవేయాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. గ్రేటర్‌లో కుక్కలు, కోతులు ప్రజలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, అధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రాగసుధ, జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాలతో పాటు పలువురు నాయకురాళ్లు ఉన్నారు.

ప్రధాన నాలాలను విస్తరించండి..

ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: వరంగల్ నగరంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే టెక్నికల్ కమిటీ సూచించిన విధంగా ప్రధాన నాలాలను విస్తరించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. గత వారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా ప్రతినిధులు, అధికారులతో జరిపిన సమీక్షలో ఆదేశించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వరంగల్ నగరంలోని వడ్డెపల్లి చెరువు, భద్రకాళి చెరువు, శాకరాసికుంట, భట్టుపల్లి, చిన్నవడ్డెపల్లి, కట్టమల్లన్న చెరువుల నుంచి వచ్చే నీరు సులువుగా వెళ్లేందుకు అడ్డంగా ఉన్న ఆక్రమ కట్టడాలను టెక్నికల్ కమిటీ ఆదేశాల మేరకు తొలగించి విస్తరణ చేపట్టాలని సూచించారు. ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) కోసం చేసుకున్న దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించాలని అన్నారు. ఇప్పటివరకు లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయని ఆమె వెల్లడించారు. నగరంలో ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చి ప్రమాదాలు జరగకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీసీపీ రవీంద్ర రాడేకర్, డీసీపీలు రవీందర్, ప్రసన్నరాణి, లీగల్ అధికారి శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమితి నాయకులు

బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 12: కులగణన జరిపి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాల్లో వెనుకకు నెట్టివేయబడుతున్న బీసీల డిమాండ్లను పరిష్కరించాలని తెలిపారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, సంవత్సరానికి రూ.20వేల కోట్లతో బీసీల సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు పర్చడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. హక్కుల సాధన కోసం బీసీలు సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్యశారదకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, బీసీ నాయకులు పంజాల రమేశ్, పరికిరాల రమేశ్, కట్కోజు చంద్రశేఖర్, బచ్చల స్వప్న, భార్గవి, లక్ష్మీ, సరస్వతి, అనూష పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలి

మట్టెవాడ, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గందె నవీన్ అన్నారు. సోమవారం వరంగల్ పిన్నవీరివీధిలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలతో 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే దృక్పథంతో హర్‌ఘర్ తిరంగా అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్, అధ్యక్షుడు రామిని సుమన్, కొత్తపల్లి రాజేష్, తాడికొండ రాము పాల్గొన్నారు.

'స్వాతంత్ర్యం కోసం పోరాటం'

శంభునిపేట, ఆగస్టు 12: దేశ స్వాతంత్రమే లక్ష్యంగా ఏర్పడిన ఏఐఎస్‌ఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12నలక్నోలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్)ను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటం చేసిందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్సాంపెల్లి సాగర్, మోటం శివకుమార్, మేకల అభిరామ్, మోరే రాజు, ప్రభాస్, సోను చౌహాన్, కె.నిశాంత్, ఖలీల్, సంతోష్, బి.రోజా, షాజీయా, నాగజ్యోతి, కీర్తన, ప్రియాంక పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలి

మిల్స్‌కాలనీ, ఆగస్టు 12: వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీలో ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం పోచమ్మమైదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఇటీవలే ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మార్టిన్ లూథర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... జిల్లాలో అన్ని మోర్చాల కన్నా ఎస్సీ మోర్చాను ముందుంచాలని కార్యకర్తలను కోరారు. అనంతరం మార్టిన్ లూథర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, నాయకులు బన్న ప్రభాకర్, మాదాసు రాజు, పోలేపాక జనార్దన్, తరగపు వీరస్వామి, గొర్రె కోటి, జన్ను కుమార్, దండు చక్రపాణి, జిలకర వీరస్వామి, సదానందం, సుబ్రమణ్యం, నర్సింగం, రాజు, రవి, అశోక్, వీరస్వామి, సుదర్శన్, బాబు, అంబేద్కర్, శ్రావణ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 12: భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడి పొందేందుకు అవకాశంఉంటుందని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు ఆర్థిక సాయంతో రైతులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథి ఉమారెడ్డి హాజరై మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించుకుని, దాని ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో పంట సాగు అనంతరం తప్పకుండా పచ్చిరొట్ట, జనుము, జీలుగ, పెసర పంటలను మరుసటి పంట సాగు చేసే ముందు కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో పత్రిత ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న, శిక్షణ తరగతుల నిర్వాహకులు రాములు, రైతులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మట్టెవాడ, ఆగస్టు 12: నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, నేర నివారణకు పాటుపడాలని షీటీమ్ హెడ్‌కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ అన్నారు. సోమవారం వరంగల్ షీ టీమ్ ఆధ్వర్యంలో వరంగల్ గ్రేన్ మార్కెట్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని, సీపీ వాట్సాప్ నెంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142 ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ నరసింహారావు, ఉపాధ్యాయులు సృజన, మనోహర్, తిరుపతి, వీణ, షీటీమ్ సిబ్బంది జే.రాజేందర్, కె.వంశీకృష్ణ పాల్గొన్నారు.

'నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి'

కరీమాబాద్, ఆగస్టు 12: ఉర్సు, కుమ్మరివాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు గడ్డం యగేందర్ కోరారు. సోమవారం యగేందర్ ఆధ్వర్యంలో రంగశాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏడీఈ సర్వేశంకు వినతిపత్రాన్ని సమర్పించారు. యుగేందర్ మాట్లాడుతూ ఉర్సు కుమ్మరివాడ గాంధీ విగ్రహం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధికలోడ్‌తో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కృష్ణ, సల్ల సారంగం, నాగపూరి రవిచంద్ర, అవునూరి భాస్కర్ ఉన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన

సంగెం, ఆగస్టు 12: కాపులకనపర్తి ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ నిర్వహణపై సోమవారం అవగాహన కల్పించారు. స్థానికురాలు ఎర్రబెల్లి గోపాల్ రావు కుమార్తె శ్రుతి, ఆమె ఇద్దరు కుమార్తెలు శ్రీష, అన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు 2017లో 10 కంప్యూటర్లను అందించి, ప్రైవేటు ఉపాధ్యాయుడిని నియమించినట్టు శ్రుతి పేర్కొన్నారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సీతాదేవి, ఉపాధ్యాయులు రాజన్న, వేంకటేశ్వర్లుగౌడ్, స్వప్నకుమారి, రతన్‌సింగ్ రాథోడ్, రవీందర్, కంప్యూటర్ శిక్షకుడు అశోక్, మాజీ ఉపసర్పంచ్ సారంగం పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మట్టెవాడ, ఆగస్టు 12: సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దొండిగాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్యలు డిమాండ్ చేశారు. సోమవారం మట్టెవాడలోని ఎంఈవో కార్యాలయంలో ఇటీవల మరణించిన సర్వశిక్ష ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు.

అనంతరం వారు మాట్లాడుతూ సర్వ శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల కు రూ. 10 లక్షల ప్రయోజనాన్ని కల్పించాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి...

శంభునిపేట, ఆగస్టు 12 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని షిరిడీ సాయి సేవా ట్రస్టు ప్రతినిధులు లలిత, వాసంతిలు అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.13వేల విలువైన ఆట వస్తువులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్, మాధవి, వీరాచారి, ప్రవీణ్, సునీల్, ఉషారాణి పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గిర్మాజీపేట, ఆగస్టు 12: గంజాయి తరలిస్తున్న ఒడిషాకు చెందిన వ్యక్తి నుంచి ఎండుగంజాయి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా గంగనాపూర్‌కు చెందిన జి.బలరాం దొర (29) చత్రపూర్‌లో కొనుగోలు చేసిన గంజాయిని తీసుకుని ఆదివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ముంబాయికి బయలుదేరాడు. సోమవారం కోణార్క్ వరంగల్‌కు చేరుకుంటున్న తరుణంలో ప్రత్యేక పోలీసు బృందం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టింది. బలరాం గంజాయి ప్యాకెట్‌లు ఉన్న తన సూట్‌కేసు, లగేజీ బ్యాగులను తీసుకుని వరంగల్‌లో కోణార్క్ దిగి రైల్వేస్టేషన్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు బలరాం 2వ ప్లాట్‌ఫాంకు చేరుకున్నాడు. రైల్వే స్టేషన్ తనిఖీలో భాగంగా జీఆర్‌పీ సీఐ జి.నరేష్ ఆధ్వర్యంలో ఎస్సై ఎం.అయిలయ్య, కానిస్టేబుల్స్ రాము, భాస్కర్, రామారావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్సై యు.వి.రావు, కానిస్టేబుల్స్ నగేష్, ఎం.శ్రీనివాస్‌లతో కూడిన బృందం 2వ ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేయగా 36.23కిలోల ఎండు గంజాయి ప్యాకెట్‌లు లభించారు. వీటి విలువ రూ.9.05లక్షలు ఉంటుంది. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని సాయంత్రం కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించారు.

గంజాయి పట్టివేత?

శంభునిపేట: మామునూరు సబ్ డివిజన్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై సోమవారం పక్కా ప్రణాళికతో పెద్ద ఎత్తున గంజాయిని సరఫరా చేస్తున్న కారును మామునూరు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు సుమారు 20కిలోల గంజాయిని ముఠా సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు చాలా మార్గాలు ఉన్నా నగరానికి ఎందుకు వచ్చారో అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్టు సమాచారం.

పశువుల కాపరి మృతి



భరత్(ఫైల్)

గీసుగొండ, ఆగస్టు 12: ప్రమాదవశాత్తు పశువుల కాపరి చెరువులో పడి మృతి చెందిన ఘటన సోమవారం గీసుగొండ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గీసుగొండకు చెందిన దౌడు భరత్ (43) కూలీ, పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామ సమీపంలోని బసవన్న చెరువు పరిసరాల్లో గేదెలను మేపటానికి వెళ్లాడు. సాయంత్రం నీటిని తాగించేందుకు చెరువు వద్దకు తీసుకెళ్లాడు. చెరువులోకి వెళ్లిన గేదెలను బయటికి తీసుకువచ్చేందుకు భరత్ అందులోకి దిగాడు. అయితే వంద రోజుల పనికింద చెరువులో మట్టి తీయగా ఏర్పడిన గుంత నీటిలో మునిగి మృతి చెందాడు. భరత్‌కు భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 12: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 19 మంది వాహనదారులకు సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 19మంది వాహనదారులకు రూ.33,300 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఐదుగురు వాహనదారులకు రూ. 7,500 జరిమానా విధించినట్లు వెల్లడించారు.



నీటిని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

గుంతల్లో నీటి తొలగింపు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గీసుగొండ, ఆగస్టు 12: గీసుగొండ మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తం శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి కార్యదర్శి యాదలక్ష్మి స్పందించారు. బంకుట్ల సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని సిబ్బందితో సోమవారం తొలగించారు. గుంత పడిన ప్రాంతంలో నీరు నిల్వకుండా, త్వరలోనే తగిన చర్యలు చేపడుతామని తెలిపారు. రోడ్డు నిర్మాణం తర్వాత సైడ్ డ్రైన్స్ నిర్మించకపోవటంతో ఈ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరంగా జరుగుతున్నాయన్నారు.

ఆరు నెలలుగా జీతం రావడం లేదు..

గత ఆరు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని గ్రామ పారిశుద్ధ్య కార్మికులు వాపోయారు. సకాలంలో జీతం రాకతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'పరిరక్షణ సమితి' ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

ఖిలావరంగల్, ఆగస్టు 12: జాతీయ వినియోగదారుల, మానవహక్కుల పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఒదెల రవికుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సహేరాభాను సోమవారం ఉత్తర్వు జారీచేశారు. శివనగర్‌కు చెందిన రవికుమార్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నందున నియమించినట్టు పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 13 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

• రూ.50,310 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

నర్సంపేట టౌన్, ఆగస్టు 12 : పేకాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన సంఘటన నర్సంపేట పట్టణంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పట్టణంలోని కొనుకటి సుదన్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నర్సంపేటకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.50,310 నగదును, ఆరు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం అరెస్టు చేసిన వారితో పాటు నగదు, సెల్ ఫోన్లను నర్సంపేట పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్లు రమణమూర్తి, రాజు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తూ భారీ ర్యాలీ



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 12 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్. ఎంఎస్‌పి నియోజకవర్గ కో-కన్వీనర్ తడుగుల విజయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిందం సిద్దు మాట్లాడారు. కార్యక్రమంలో బొచ్చు రఘుపతి, ఇసాక్, బానాల రమేశ్, మాదాసి సదానందం, మంద ప్రకాశ్, కొడారి రవి, కల్లెపెల్లి సురేశ్, మునిగె యాకోబ్, బానాల శ్రీనివాస్, కొమ్ముల నవీన్, మాదాసి నర్సింహరావు, మంద ప్రసాద్, మారెపల్లి అశోక్, వేల్పుగొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి శుద్ధి



సుభాష్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట, ఆగస్టు 12 : దేశ స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ నాయకులు సోమవారం క్షీరాభిషేకంతో శుద్ధిచేశారు. హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబు ఆధ్వర్యంలోని పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహ పరిసరాలను శుభ్రంచేసి, విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలవేసి నివాళులర్పించి, మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొడితేనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని భావించి ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టడానికి ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. సుభాష్ ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బానోతు వీరన్న, కౌన్సిలర్ బోడ గోల్యానాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, జిల్లా ఎస్సీ మోర్చా కో-కన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, పొదిల రాంచందర్, నూనె రంజిత్, రాయగిరి యాదగిరి. మల్యాల సాంబమూర్తి, ఠాకూర్ శివాంజన్ సింగ్, ఠకూర్ విజయ్‌సింగ్, చిలుక కుమార్, బానోతు రాజేందర్, సామల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష

చెన్నారావుపేట. ఆగస్టు 12 : మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి వరంగల్ సెషన్స్ కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి ప్రేమలత రెడ్డి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... గత సంవత్సరం ఐదేళ్ల బాలికపై ఇంట్లో ఎవరూలేని సమయంలో అదే గ్రామానికి చెందిన రఘుపతి అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా. వెంటనే బాలిక తల్లిదండ్రులు రావడంతో రఘుపతి అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోనికి తీసుకొని దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించిన పోలీసులు సోమవారం వరంగల్ సెషన్స్ కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి ప్రేమలత రెడ్డి ముందు కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానాతోపాటు బాధితురాలికి రూ.1లక్ష పరిహారంగా అందించాలని జడ్జి తీర్పునించారు. నిందితుడికి శిక్షపడడంలో కృషి చేసిన ఎస్సై గూడ అరుణ్‌కుమార్‌ను. కోర్టు కానిస్టేబుల్ సురేందర్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

నిరుపయోగంగా ఏడబ్ల్యూఎల్ఆర్ యంత్రాలు

ఏడాదిగా పూర్తిస్థాయిలో వినియోగంలోని రాని యంత్రాలు

పాకాల సరస్సు తూముపై, పాకాల బ్రిడ్జిపై యంత్రాల ఏర్పాటు

ఖానాపురం, ఆగస్టు 12 : మండలంలోని పాకాల సరస్సు జలాశయంలో నీటి నిలువ ఎంత ఉందో సిబ్బంది అవసరం లేకుండా ఎప్పటికప్పుడూ తెలుసుకునేందుకు ఏడాది క్రితం పాకాల సరస్సు టవర్ తూముపై, ఖానాపురం శివారులోని పాకాల బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాటర్ లెవలింగ్ రికార్డర్ (ఏడబ్ల్యూఎల్ఆర్) యంత్రాలు నేటికి పూర్తిస్థాయిలోకి వినియోగంలోకి రాకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నీటిపారుదల శాఖ అనుబంధ హైడ్రాలజీ విభాగం అధికారుల పర్యవేక్షణలో ఈ యంత్రాల నిర్వాహణ కొనసాగాల్సి ఉంది. ఈ యంత్రాలు సౌరశక్తితో, బ్యాటరీల సహాయంతో



ఖానాపురం శివారులోని పాకాల బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన యంత్రం

పనిచేసి కెమెరాలు, సెన్సార్‌ల సహాయంతో జలాశయంలో ఉన్నా నీటిమట్టం, వర్షాపాతం, ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలి దిశలను అంచనా వేయగలవు, వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడూ అంచనావేస్తూ నేరుగా హైదరాబాద్‌లోని ప్రధాన ఈఎస్‌సీ కార్యాలయానికి స్థానికంగా ఉన్న అధికారులకు తాజా సమాచారం అందించాల్సి ఉంటుంది.

పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు

ఈ పరికరాన్ని శాటిలైట్‌కు అనుసంధానం చేసి నీటి పారుదల శాఖ అధికారులకు అప్పగించాల్సి ఉండగా, పరికరాలు ఏర్పాటు చేసిన కొత్తలో నీటిపారుదల శాఖలోని ఉన్నతాధికారులకు ఈ యంత్రం పనితీరుపై అవగాహన కల్పించి ప్రత్యేకంగా రూపొందించిన మోబైల్ యాప్ ద్వారా వివరాలను ఎప్పటికప్పుడూ తెలుసుకునేవిధంగా శిక్షణ ఇచ్చారు. కాగా, ఈ యాప్ కొన్ని రోజుల వరకే పనిచేయడంతో పరికరాల వల్ల ఉపయోగం లేకపోవడంతో నెలల తరబడి ఈ యంత్రాలు నిరుపయోగంగా ఉండి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకుండా ఉన్నాయి. దీంతో స్థానిక అధికారులకు సమాచారం అందడం లేదు. సెన్సార్, శాటిలైటు సాంకేతికత ఆధారంగా ఇది పనిచేస్తుంది. వీటి సేవలు ఎప్పటినుంచి పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వస్తాయనే అంశంపై అధికారుల్లో స్పష్టత లేదు.



పాకాల సరస్సు టవర్ తూముపై ఏర్పాటు చేసిన యంత్రం

కోర్టు తీర్పుతో మంద కృష్ణకు, బీజేపీ ప్రభుత్వానికి సంబంధం లేదు

నెక్కొండ, ఆగస్టు 12 : ఎస్సీల వర్గీకరణ తీర్పుతో మంద కృష్ణకు, కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి సంబంధం లేదని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ ఈదునూరి యాకయ్య అన్నారు. సోమవారం నెక్కొండలోని అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటంలో ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారని, వారి త్యాగ ఫలితంగానే సుప్రీంకోర్టు నుంచి అనుకూల తీర్పు వచ్చిందన్నారు. వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధతను కల్పిస్తామంటూ పూర్తి మేజార్టీ ఉన్న సమయంలో బీజేపీ బిల్లు ప్రవేశపెట్టి ఆర్టికల్ 341 సవరణ చేయకుండా కాలయాపన



మాట్లాడుతున్న ఈదునూరి యాకయ్య

చేస్తూ ఎస్సీలను మోసం చేసిందని ఆరోపించారు. అనుకూల తీర్పుకు కాంగ్రెస్ నేతలు, సుప్రీం కోర్టు న్యాయవాదులు వర్గీకరణకు మద్దతుగా వాదనలు చేశారన్నారు. ఈ పోరాటం ఏ ఒక్కరి విజయం కాదని, సామాజిక న్యాయం పొందడం అందరి హక్కు అనేది డాక్టర్ అంబేడ్కర్ ఆలోచన విధానమన్నారు. ఈ నెల 13న ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే మాదిగ అమరవీరుల సంస్మరణ సభకు మాదిగలు తరలివచ్చి వారి ఆత్మలకు శాంతిని చేకూర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌టీఎస్ మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం రమేశ్, జంజాల యాకయ్య, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్ కౌంటర్ సంతకం చేసేందుకు రూ.6.వేలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏఈ గోపాల్‌కు లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక ఈ నెల 9న యాకు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో సోమవారం ఉదయం 11:53 నిమిషాలకు హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట గోపాల్ బాధితుడు యాకు నుంచి రూ.6వేలు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ డి.సాంబయ్య తెలిపారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, ఎస్.రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట టౌన్, ఆగస్టు 12 : హైదరాబాద్‌లోని యూసుఫ్ గూడలో గ్లోబల్ షొటోకాన్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 6వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో నర్సంపేట మినీ స్టేడియంకు చెందిన గ్లోబ్ షొటోఖాన్ ఇండియా విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రతిభనుచాటారు. కరాటే పోటీల్లో 16 సంవత్సరాల బాలికల కటాస్ విభాగంలో జి.సమత, ఎ.సాహితి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కరాటే కోచ్ షేక్ జానీ తెలిపారు. అలాగే 12 సంవత్సరాల కటాస్ విభాగంలో సిరీన్, నిశాంత్ సాయి సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ప్రతిభను చాటిన విద్యార్థులను గ్లోబ్ షొటోఖాన్ ఇండియా వ్యవస్థాపకుడు వెంకటేశం అభినందించారు.

విద్యార్థినులకు జిల్లాస్థాయి బహుమతులు

చెన్నారావుపేట, ఆగస్టు 12 : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి బహుమతులు అందుకున్నట్లు హెచ్ఎం జయ సోమవారం తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 8వ తరగతి చదువుతున్న సీహెచ్ ద్రాక్షాయణి ఉపన్యాస పోటీల్లో మొదటి బహుమతిని, 9వ తరగతి చదువుతున్న రెడ్డబోయిన కీర్తన తృతీయ బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు. ఉదయ్‌కుమార్, రమాదేవి. వర్ధెల్లి సతీష్, వ్యాయమ ఉపాధ్యాయురాలు పుష్ప, జాహేద్ పాల్గొన్నారు.

పంట రుణాల రెన్యూవల్ పూర్తి చేయాలి

వరంగల్ కలెక్టరేట్ : పంట రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యూవల్ చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మొదటి, రెండో విడతల్లో రైతు రుణమాఫీ, రెన్యూవల్ పురోగతిపై బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు చేపట్టిన రుణ మాఫీపథకంలో రైతులకు లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. పంట రుణాలు పొందిన డబ్బులను వ్యవసాయ పనుల నిమిత్తం వాడుకునేలా చూడాలన్నారు. బ్యాంకు అధికారులు రుణమాఫీ డబ్బులు ఇతర రుణాల కింద జమ చేయకుండా సకాలంలో చెల్లించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి,



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మాజీ మావోయిస్టు సభ్యురాలికి చెక్కు అందజేత

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మనుబోతులగడ్డకు చెందిన సీపీఐ (మావోయిస్టు) పార్టీ సభ్యురాలు షేక్ ఇమాంబీ అలియాస్ జ్యోతక్క మార్చి 19న జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఎదుట లొంగిపోయారు. ఆమెపై ఉన్న రూ.8లక్షల రివార్డును మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సోమవారం ఆమెకు చెక్కురూపంలో అందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సరెండర్ -కమ్- పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకుని జనజీవన స్రవంతిలో చేరాలని చెప్పారు. మావోయిస్టు భావజాలంతో భ్రమపడిన మావోయిస్టు క్యాడర్ లందరికీ బహిరంగ అభ్యర్థన చేయడం జరుగుతుందన్నారు. సమాజం, శాంతియుత జీవితాన్ని గడపడానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని చెప్పారు.



షేక్ ఇమాంబీకి చెక్కు అందజేస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

సి.నారాయణరెడ్డి అవార్డు అందుకున్న సత్యనారాయణస్వామి

నర్సంపేట టౌన్, ఆగస్టు 12 : పట్టణానికి చెందిన కవి, రచయిత గజవెళ్లి సత్యనారాయణస్వామికి తెలుగు భాషా చైతన్య సమితి, త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సి.నారాయణరెడ్డి అవార్డును అందజేశారు. ఆ సంస్థ బాధ్యులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గంట మనోహర్‌రెడ్డి, డాక్టర్ ఎన్.బాలాచారి, జనార్ధనమూర్తిల చేతుల మీదుగా సత్యనారాయణస్వామికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామికి అవార్డు రావడం పట్ల చాతాద శ్రీవైష్ణవ సంఘం గౌరవ అధ్యక్షుడు రంగనాథస్వామితో పాటు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



ఎల్లయ్య (ఫైల్)

వర్ధన్నపేట, ఆగస్టు 12 : తన కుడికాలికి సిమెంటు పట్టి వల్ల జరిగే బాధను భరించలేక, నొప్పిని తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... వర్ధన్నపేట పట్టణానికి చెందిన దోపతి ఎల్లయ్య (60) గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం తన కుడికాలి మడిమకు ప్రమాదవశాత్తు దెబ్బ తగిలింది. దీంతో నరం చితికిపోయింది. ఎల్లయ్యకు కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్సచేయించగా కాలుకు సిమెంటు పట్టివేశారు. దీంతో అవస్థ పడుతుండేవాడు. తిరిగి నెల తర్వాత చికిత్స కోసం వెళ్లగా మరో నెలపాటు సిమెంటు పట్టి వేసుకుంటే నయం అవుతుందని డాక్టర్ చెప్పి తిరిగి సిమెంటు పట్టి వేశారు. సోమవారం భార్య వెంకటలక్ష్మి, కుమారుడు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఉండి కాలు నొప్పిని భరించలేని ఎల్లయ్య ఇంటి పక్కనున్న రేకుల షెడ్డు పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. పనులు ముగించుకొని మధ్యాహ్నం 3గంటలకు ఇంటికి వచ్చిన వెంకటలక్ష్మి రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఎల్లయ్య ఉండడాన్ని గమనించి రోదిస్తూ కేకలు వేసింది. దీంతో ఇరుగు పొరుగు వారు వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందిఉన్నాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని భౌతిక కాయాన్ని పోస్టు మార్టానికి తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

కంప్యూటర్‌పై అవగాహన

సంగెం, ఆగస్టు 12 : కాపులకనపర్తి ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ నిర్వహణపై సోమవారం అవగాహన కల్పించారు. స్థానికురాలు ఎర్రబెల్లి గోపాల్ రావు కుమార్తె శ్రుతి, ఆమె ఇద్దరు కుమార్తెలు శ్రీష, అన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు 2017లో 10కంప్యూటర్లను అందించి, ప్రైవేటు ఉపాధ్యా యుడిని నియమించినట్లు శ్రుతి పేర్కొన్నారు. కార్యక్రమం లో తాజా మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, పాఠ శాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపా. ధ్యాయులు రాజన్న, వేంకటేశ్వర్లుగౌడ్, స్వప్నకుమారి, రతన్‌సింగ్ రాథోడ్, రవీందర్, కంప్యూటర్ శిక్షకుడు బండి అశోక్, మాజీ ఉప సర్పంచ్ సారంగం పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నర్సంపేట, ఆగస్టు 12 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. పట్టణంలోని పాఖాల మహిళా బ్యాంక్‌లో హృదయ స్పందన హోప్ సేవా సొసైటీ అధ్యక్షుడు పెండెం శివానంద్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించిన ఉచిత కుట్టుశిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. శిక్షణ ముగిసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎం ప్రసూనలక్ష్మి మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు సొసైటీ సభ్యులతో కలిసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఖాల మహిళా బ్యాంక్ అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, ఇమ్మడి పద్మ, గొడిశాల వనజ, మాణిక్యం, కీసరి విజయ, దేవుపల్లి వాణి, పూజారి ప్రసన్న, రమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

చెన్నారావుపేట, ఆగస్టు 12 : మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారు పనికరగుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పంజాల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ 2005నుంచి స్థలంలో గుడిసెలు వేసుకొన్న ప్రజలందరికీ పట్టాలను అందించాలన్నారు. 30 మందికి పైగా గుడిసె వాసులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నరని అన్నారు. ఈ కార్యక్రమంలో కందిక చెన్నకేశవులు. జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేష్, గుంపల్లి మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దుగ్గొండి, ఆగస్టు 12 : మండలంలోని బంధంపల్లిలో పలువురు సోమవారం హన్మకొండలోని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో హింగే విక్రమ్, మొగులోజు రాజు, రాంచంద్రు, సీనియర్ నాయకుడు చిమ్మని రమేశ్ ఉన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావుకు ఉత్తమ గ్రంథాలయ అధికారి అవార్డు

నెక్కొండ, ఆగస్టు 12:నెక్కొండ గ్రంథపాలకుడు బి.పద్మారావు ఉత్తమ గ్రంథాలయ అధికారి అవార్డును అం దుకున్నారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురష్కరించుకొని గ్రాంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతి సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ లైబ్రరీలో సోమవారం పద్మరావుకు అవార్డును గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఖానాపురం, ఆగస్టు 12 : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల కేంద్రంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం మండల వ్యాప్తంగా 85మంది లబ్దిదారులకు రూ.24,79,000 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

నల్లబెల్లి, ఆగస్టు 12 : ఏళ్ల తరబడి పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జిల్లా సమగ్ర శిక్ష ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు సుద్దాల ఆనందం తెలిపారు. సోమవారం ఎంఈవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎం.రాజేశ్వరి, జి.విజయ్‌కుమార్, టి.భిక్షపతి, వి.రవి, డి.వెంకటయ్య, జె.రాంబాబు, ఎం.వీరాచారి, ఎస్.లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నెక్కొండ, ఆగస్టు 12: వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులకు గురైన వారిని ఆరోగ్య సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్సలు అందించి వ్యాధుల ను అరికట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ ఆదేశించారు. సోమవారం మండలంలోని బొల్లికొండలో అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. శిబిరంలో 45 మంది రోగులకు రక్తపూత పరీక్షలను జరిపారు. 103 మంది రోగులకు వైద్య పరీక్షలను జరిపి మందులను పంపిణీచేశారు. శిబిరంలో అలంకానిపేట వైద్యాధికారి డాక్టర్ అర్చన, డాక్టర్ సుమన్, డాక్టర్ సుధా, డాక్టర్ రాహుల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోపడి పశువుల కాపరి మృతి



భరత్ (ఫైల్)

గీసుగొండ, ఆగస్టు 12: ప్రమాదవశాత్తు పశువుల కాపరి చెరువులో పడి మృతి చెందిన ఘటన సోమవారం గీసుగొండ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గీసుగొండకు చెందిన దౌడు భరత్ (43) కూలి పనుల చేసుకుంటూ పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామ సమీపంలోని బసవన్న చెరువు పరిసరాల్లో గేదెలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం నీటిని తాగించేందుకు చెరువు వద్దకు తీసుకెళ్లాడు. చెరువులోకి వెళ్లిన గేదెలను బయటికి తీసుకువచ్చేందుకు భరత్ అందులోకి దిగాడు. అయితే వంద రోజుల పనికింద చేరువులో మట్టి తీయగా ఏర్పడిన గుంత నీటిలో మునిగి మృతి చెందాడు. భరత్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

పాపయ్యపేట సొసైటీలోని యూరియా గూడూరుకు అక్రమణ రవాణా

• దుకాణ డీలర్‌పై కేసు నమోదు

చెన్నారావుపేట, ఆగస్టు 12 : చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలోని సొసైటీ గోదాంలోని యూరియా అక్ర మంగా తరలిపోతోంది. రైతుల ఆధార్ కార్డులను పొందుపర్చుకొని వ్యవసాయ విస్తీర్ణంబట్టి యూరియాను అందిస్తుంటారు. ఇదే అదునుగా భావించిన మధ్య దళారులు ఇతర ప్రాంతాలకు యూరియాను తరలిస్తున్నారు. తాజాగా మండలంలోని పాపయ్యపేట సొసైటీ పరిధిలో ఉన్న జోజేర్యు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన ఓ ఫెర్టిలైజర్ అండ్ ఫర్టిసైడ్స్ దుకాణానికి సుమారు 78 బస్తాల యూరియాను తరలించారు. ఈ విషయాన్ని పలువురు గమనించి సొసైటీ జిల్లా అధికారులకు. వ్యవసాయ శాఖాధి కారులకు సమాచారం అందించారు. తొలుత సొసైటీ అధికారులు. పాలక వర్గ సభ్యులు అక్రమంగా యూరియా తరలిరవు ఆరా తీసీ సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో పాపయ్యపేట సొసైటీ, గూడూరులో ఉన్న ఎరువుల దుకాణంలో సోదాలను నిర్వహించారు. సదరు ఎరువుల దుకాణం యాజమానిపై 6ఏ కేసు కింద నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసిన అధికారులు గూడూరులోని ఎరువుల దుకాణంలో ఉన్న యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై నర్సంపేట ఏడీఏ కీసరి నగేష్‌ను వివరణకోరగా.. పాపయ్యపేట సొసైటీకి చెందిన ఎరువుల దుకాణాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఆధార్ కార్డులు చూపుతూ 78బస్తాల ను. సొసైటీ సిబ్బందిలో ఒకరు, మరో వ్యక్తి సాయంతో గూడూరులోని ప్రైవేటు ఫెర్టిలైజర్ దుకాణానికి తరలించిన విషయంపై విచారణ జరుగుతుందని, ఈ విషయంపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉషాదయాల్, డీసీవో సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే సొసైటీ సీఈవోకు వివరణ ఇవ్వాలని షోకాజు నోటీసులను అందిస్తామని తెలిపారు. ప్రైవేటు ఎరువుల దుకాణాలకు ఎరువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతల్లో నీటి తొలగింపు

• 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



నీటిని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

గీసుగొండ, ఆగస్టు 12 : మండల కేంద్రంలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తం శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి కార్యదర్శి యాదలక్ష్మి స్పందించారు. బంకుట్ల సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని సిబ్బందితో సోమవారం తొలగించారు. గుంతపడిన ప్రాంతంలో నీరు నిల్వకుండా, త్వరలోనే తగిన చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్డు నిర్మాణం తర్వాత సైడ్‌డ్రైన్స్ నిర్మించకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరంగా జరుగుతున్నాయన్నారు.

ఆరు నెలలుగా జీతం రావడం లేదు..

గత ఆరు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని గ్రామ పారిశుధ్య కార్మికులు వాపోయారు. సకాలంలో జీతం రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.